క్లుప్తంగా

వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు నేడు

రణస్థలం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు రణస్థలంలో శనివారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఎచ్చెర్ల నియోజకవర్గ పార్టీ కార్యాలయం నుంచి శుక్రవారం ఒక ప్రకటన విడుదలైంది. కార్యక్రమానికి ఎచ్చెర్ల నియోజకవర్గ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ముగిసిన స్పోర్ట్స్ మీట్



విజేతలకు ట్రోఫీలు అందజేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహించిన పోలీస్ స్పోర్ట్సుమీట్ – 2024 గురువారంతో ముగిసింది. ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో రాత్రి ముగింపు వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్ స్వప్నిక్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి హాజరయ్యారు. జిల్లా నుంచి ఐదు జట్లు ఆర్మ్‌డు రిజర్వు, శ్రీకాకుళం, కాశీబుగ్గ, టెక్కలి సబ్ డివిజన్ జట్లు, హోం గార్డులు తలపడగా, అన్ని విభాగాల్లో మెరుగైన ప్రదర్శన చేసిన ఆర్మ్‌డ్ రిజర్వు జట్టు ఓవరాల్ ఛాంపియన్ షిప్ కైవసం చేసుకుంది. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అదనపు ఎస్పీ కె.వి.రమణ, డీఎస్పీలు వివేకనంద, శేషాద్రి పాల్గొన్నారు.

పరామర్శ



శ్రీనివాసరావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జి.సిగడాం: మండలంలోని జాడ పంచాయతీ ఎంపీటీసీ సభ్యుడు పెద్ది శ్రీనివాసరావు అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో సమాచారం తెలుసుకుని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శుక్రవారం గ్రామానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆయనతో పాటు మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ, జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, జిల్లా సభ్యుడు పిల్లల శివకుమార్, నాయకులు చిక్కాల ధర్మారావు, లక్ష్మణరావు, ఇజ్జి కోటి, శ్రీను, పెద్ది మాధవరావు, కోరాడ అచ్చారావు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నక్షత్రబాట పుస్తకావిష్కరణ రేపు



నక్షత్రబాట నవలతో రచయిత అప్పలనాయుడు, కన్వీనర్ శ్రీనివాసరావులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని వరం రెసిడెన్సీలో అట్టాడ అప్పలనాయుడు రచించిన 'నక్షత్ర బాట' పుస్తకాన్ని శ్రీకాకుళం సాహితీ స్రవంతిల ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించనున్నట్లు రచయిత అప్పలనాయుడు, సాహితీ స్రవంతి కన్వీనర్ కేశవపు శ్రీనివాసరావులు శుక్రవారం తెలిపారు. గంటేడ గౌరన్నాయుడు అధ్యక్షతన ఆంధ్ర యూనివర్సిటీ లా కళాశాల విశ్రాంత ప్రొఫెసర్ ఎస్.నిర్మల పుస్తకావిష్కరణ చేస్తారన్నారు. శ్రీకాకుళం సాయుధ రైతాంగ పోరాట అమరుల వారసులకు ఆత్మీయ అభినందన సభ నిర్వహిస్తామన్నారు.

మహిళల జీవన ప్రమాణాలు మెరుగవ్వాలి



శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: స్వయం సహాయక సంఘాల మహిళల జీవన ప్రమాణాలు మెరుగవ్వాలని సెర్ప్ రీసోర్సు పర్సన్ రాజారావు అన్నారు. ఎచ్చెర్లలోని జిల్లా సాంకేతిక శిక్షణ కేంద్రంలో వెలుగు ఏసీ, ఏపీఎం, ఎల్‌సీలకు రెండు రోజుల పాటు నిర్వహించిన కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్ పాలన, నాయకత్వ లక్షణాలపై శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ.. గ్రామ, మండల, జిల్లా సమాఖ్యలు సమర్థులను ఎన్నుకోవాలన్నారు. నాయకత్వ లక్షణాలు, పాలనా సామర్థ్యం ఆధారంగా ఈ ఎంపిక ఉండాలని పేర్కొన్నారు. గ్రామం యూనిట్‌గా ప్రతీ ఎస్‌హెచ్‌జీ మహిళ పొదుపు తీసుకోవడం, సక్రమంగా చెల్లించడం, స్వయం ఉపాధి యూనిట్లు నిర్వహించడం చేయాలని సూచించారు. మృతి చెందిన మహిళలను సంఘాల నుంచి తొలగించి వారి లావాదేవీలను పూర్తిస్థాయిలో ముగించాలన్నారు. కార్యక్రమంలో రీసోర్సు పర్సన్ రామ్మూర్తి, అధికారులు మోహన్‌రావు, భాగ్యలత, పుష్ప తదితరులు పాల్గొన్నారు.



మాయదారి వాన...

అన్నదాత హైరానా..!

- రైతులను వెంటాడుతున్న వర్షాలు
- కల్లాల్లోనే ధాన్యం
- తేమశాతంపై ఆందోళన

ఎచ్చెర్ల క్యాంపస్: అకాల వర్షాలు అన్నదాతను ఆందోళనకు గురి చేస్తున్నాయి. పంట చేతికందే వచ్చే సమయానికి గుండెల్లో అలజడి రేపుతున్నాయి. గత రెండు రోజులుగా ఎచ్చెర్ల నియోజకవర్గంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం, జి.సిగడాం మండలాల్లో సాగునీటి కాలువలు, వర్షాధార చెరువులు ఆధారంగా ఈ ఏడాది 28 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. ప్రస్తుతం దాదాపుగా వరి కోతలు పూర్తయ్యాయి. నూర్పులు మాత్రం 20 శాతం పూర్తయ్యాయి. ఇంకా 80 శాతం పొలాల్లో వరి కుప్పలు పెట్టారు. గతంలో కల్లాలకు వరి పంట తరలించి నూర్పులు చేసేవారు. ప్రస్తుతం ఈ పద్ధతి ఖర్చుతో కూడుకున్నది కావడంతో పొలాల్లోనే యంత్రాలు ద్వారా నూర్పు చేసి, ధాన్యం అమ్మడం, ఇంటికి తరలించడం చేస్తున్నారు.

కుప్పల్లోకి నీరు

వర్షాలు వలన కుప్పల్లో నీరు చేరడం, పొలాల్లోకి నీరు చేరడం వలన ధాన్యం మొలకెత్తే ప్రమాదం పొంచి ఉంది. అలాగే ధాన్యంలో తేమ శాతం పెరగడం వంటివి సమస్యగా మారుతాయి. దీనివలన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తిరస్కరణకు గురి కావడం, ధాన్యం కొనుగోలు కోసం దళారులు, మిల్లర్లపై ఆధారపడాల్సిన దుస్థితి వస్తుంది. అందువలన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. ప్రతిఏటా అతివృష్టి, అనావృష్టిలు తమను వెంటాడుతుండడంతో నష్టాల బారిన పడుతున్నామని వాపోతున్నారు.

జాగ్రత్తలు అవసరం



వర్షాలకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. పొలాల్లోని కుప్పల అడుగు భాగాల్లో నీరు చేరకుండా చర్యలు చేపట్టాలి. కుప్పలపై నుంచి నీరు లోపలికి వెళ్లకుండా టార్పాలిన్లు ఏర్పాటు చేసుకోవాలి. వర్షాలు తగ్గాక కుప్పలు పరిశీలించాలి. తేమ ఉంటే ఆర బెట్టాలి. పరిస్థితులు అనుకులిస్తే నూర్పులు పూర్తి చేయాలి.

– వై.సురేష్, మండల వ్యవసాయ అధికారి

కష్టాలు వెంటాడుతున్నాయి



ప్రతీ సంవత్సరం పంటలు చేతికి వచ్చే నవంబర్, డిసెంబర్‌లో విపత్తులు సమస్యగా మారతున్నాయి. వరి పంట సమయంలో చేలు పడిపోవడం, దోమ పోటు, పూర్తిగా దిగుబడులు తగ్గడం వంటి సమస్యలు వస్తున్నాయి. పంట పండిన తర్వాత అకాలు వర్షాలు వల్ల కుప్పల్లో నీరుచేరి తేమ శాతం పెరుగుతోంది. అతివృష్టి వర్షాలు సమస్యగా మారుతున్నాయి.

– సనపల రవికుమార్, ఇబ్రహింబాద్

సమస్యలు తప్పడం లేదు



రైతులకు ఏటా అతివృష్టి, అనావృష్టి సమస్యగా మారుతోంది. ఖరీఫ్ చివరిలో వర్షాలు అనుకూలించక పంటలు ఎండిపోయాయి. ప్రస్తుతం చేతికి వచ్చిన పంటలు తడిసి ముద్దవుతున్నాయి. వ్యవసాయం అంటే భయపడేలా వాతావరణం ఉంది. గత కొన్నేళ్ల నుంచి ఇదే సమస్య ఎదురవుతోంది. యాజమాన్యపు ఖర్చులు పెరగడం, చేతికి వచ్చిన పంట ద్వారా అరకొర ఆదాయం రావడం ప్రధాన సమస్యగా మారుతోంది. – నక్క శ్రీనివాసరావు, కొంగరాం

హక్కులు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: సమాజంలో అన్నివర్గాల వారితో సమానంగా ట్రాన్స్ జెండర్స్‌కు సైతం హక్కులు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాకుళం జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసి నాయుడు సూచించారు. శుక్రవారం శ్రీకాకుళం జిల్లా న్యాయస్థానం ఆవరణలో ఉన్న న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో ట్రాన్స్ జెండర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించుకునేందుకు చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. అనేక మంది ట్రాన్స్‌జెండర్లు సొంత ఇల్లు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారని, దీనికోసం గృహ నిర్మాణ శాఖకు, కలెక్టర్‌కు రికమండ్ చేస్తామని హామీ ఇచ్చారు. ఒక రేషన్ కార్డుకి ఒక ఇల్లు మాత్రమే మంజూరు చేస్తారని, రెండో ఇల్లు కావాలంటే ప్రత్యేకంగా కార్డు ఉండాలన్నారు. పింఛన్ అందనివారికి పింఛన్ మంజూరు చేసేందుకు దరఖాస్తు చేస్తామని తెలిపారు. సమావేశాలకు హాజరవ్వాలని, చట్టం నిర్దేశించిన మేరకు అన్ని రకాల పథకాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. త్వరలో స్కిల్ డ్రైవ్ పెడదామన్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ ఎబిల్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ కె.కవిత, డిస్ట్రిక్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ కె.సుధ, డిస్టిక్ స్కిల్ డవలప్‌మెంట్ ఆఫీసర్ వి.సాయికుమార్, సీనియర్ న్యాయవాది ఇందిరా ప్రసాద్, బెజ్జపురం యూత్ క్లబ్ ప్రసాద్, మల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎండీఎం అమలుపై సమావేశం నేడు

శ్రీకాకుళం న్యూకాలనీ: వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నుంచి జూనియర్ కళాశాలల్లో ఎండీఎం అమలు కానున్న నేపథ్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఆ కళాశాలలతో ట్యాగ్ అయిన ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో శనివారం సమావేశం నిర్వహించనున్నట్లు ఇంటర్మీడియట్ విద్య డీవీఈవో శివ్వాల తవిటినాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల క్యాంపస్‌లో ఇంటర్మీడియట్ బోర్డు ఆర్‌ఐఓ కార్యాలయానికి సమీపంలో ఉన్న ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల వేదికగా ఉదయం 10 గంటల నుంచి ఈ సమావేశం మొదలవుతుందన్నారు. విధిగా సమావేశానికి హాజరుకావాలని సూచించారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- సినీ నటి శ్రీలీల



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీలీల, ఎమ్మెల్యే గొండు శంకర్, డీఎస్పీ వివేకానందలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ప్రముఖ సినీనటి శ్రీలీల కోరారు. నగరంలో జీటీ రోడ్డులోని సీఎంఆర్ షాపింగ్ మాల్ కార్యక్రమానికి శుక్రవారం విచ్చేసిన సందర్భంగా మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలు గురించి తెలిపే డ్రగ్స్ వద్దు బ్రో, సంకల్పం పోస్టర్లను శ్రీకాకుళం పట్టణ సబ్ డివిజన్ డీఎస్పీ వివేకానంద్ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగానికి యువత దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. యువత మత్తు పదార్థాల బారినపడి విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తుకు బానిసైతే జీవితం చిత్తవుతుందన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంతో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సీఎంఆర్ షాపింగ్ మాల్ యాజమాన్యం, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశోధనలతో గుర్తింపు



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ స్వప్నవాహిని

శ్రీకాకుళం న్యూకాలనీ: పరిశోధనలే అధ్యాపకులకు గుర్తింపు తీసుకొస్తాయని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ డీన్ డాక్టర్ స్వప్న వాహిని పేర్కొన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలోని రీసెర్చ్ సెంటర్ విభాగం ఆధ్వర్యంలో 'డిగ్రీ కళాశాలల్లో పరిశోధనాభివృద్ధి' అనే అంశంపై అధ్యాపకులు, పరిశోధన విద్యార్థులతో అవగాహన కార్యక్రమం శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్సిటీ స్థాయిలో పరిశోధనలకు కావాల్సిన సౌకర్యాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ మాట్లాడుతూ కళాశాల స్థాయిలో పరిశోధన విభాగాన్ని బలోపేతం చేయడం కోసం రీసెర్చ్ సెంటర్‌ని ఏర్పాటు చేశామన్నారు. రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు ద్వారా పరిశోధన పర్యవేక్షణ నిర్వహించే అవకాశం కళాశాల అధ్యాపకులకు లభించిందని, పరిశోధకులకు కూడా ఇది నూతన అధ్యాయమని పేర్కొన్నారు. 8 మంది పరిశోధన పర్యవేక్షకులు, 15 మంది పరిశోధక విద్యార్థులుతో పాటు నాలుగు పేటెంట్లు మరియు 90 జాతీయ అంతర్జాతీయ పరిశోధన వ్యాసాలు రీసెర్చ్ సెంటర్ పరిధిలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల రీసెర్చ్ సెంటర్ కన్వీనర్ డాక్టర్ ఎం.ప్రదీప్, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ రోణంకి హరిత, డాక్టర్ ఢిల్లీశ్వరరావు, డాక్టర్ శశిభూషణ్, డాక్టర్ పోలినాయుడు, డాక్టర్ పీవీ రమణ, డి.ఆదినారాయణ, పరిశోధన విద్యార్థులు టి.ప్రసాదరావు, జి.నరేష్, జి.విజయకుమార్, ఐ.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

పంచ్ అదుర్స్

- రాష్ట్ర సీనియర్స్ బాక్సింగ్ పోటీల్లో 10 పతకాలు కైవసం
- ఓవరాల్ ఛాంపియన్ షిప్‌లో రన్నరప్‌గా నిలిచిన శ్రీకాకుళం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం బాక్సింగ్ క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పంచ్ పవర్ చూపించారు. కాకినాడ జిల్లా పిఠాపురం వేదికగా జరిగిన ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ పురుషుల బాక్సింగ్ ఛాంపియన్‌షిప్–2024 పోటీల్లో సిక్కోలు బాక్సర్లు పతకాల మోత మోగించారు. ఈ పోటీల్లో జిల్లా క్రీడాకారులు మూడు బంగారు, ఐదు రజత, మరో రెండు కాంస్య పతకాలతో కలిపి మొత్తం పది పతకాలు సాధించి శభాష్ అనిపించారు. అలాగే ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లో రన్నరప్‌గా జిల్లా నిలిచింది. ఈ పోటీల్లో ఆర్.హేమంత్ (92+ బరువు విభాగం) బంగారు పతకం, సీహెచ్ జనేశ్వర్ (50 కేజీలు), పి.అప్పలరాజు (55 కేజీలు) బంగారు పతకాలు సాధించారు. పి.విశ్వేశ్వరరావు(60 కేజీలు), ఎం.లోకేష్(65 కేజీలు), ఎస్.యేశు(70 కేజీలు), కె.శ్రీకాంత్(75 కేజీలు), డి.మనోజ్‌కుమార్ (85 కేజీలు) రజత పతకాలు సాధించారు. ఎల్.అభిరాం, జశ్వంత్‌సాయిలు కాంస్య పతకాలు సాధించారు. బంగారు పతకాలు సాధించిన ముగ్గురు క్రీడాకారులు త్వరలో ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. కాగా రాష్ట్ర పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, జిల్లా బాక్సింగ్ ఫౌండర్ బలగ అనంతలక్ష్మణ్‌దేవ్ (అను) అభినందించారు. పోటీలకు స్వయంగా హాజరై క్రీడాకారులను దగ్గరుండి ప్రోత్సహించారు. వీరిని తీర్చిదిద్దుతున్న కోచ్ ఉమామహేశ్వరరావును మెచ్చుకున్నారు. అలాగే ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు, ఆర్‌టీసీ చైర్మన్ బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. డీఎస్‌డీవో డాక్టర్ కె.శ్రీధర్‌రావు, భీమేశ్వర బాక్సింగ్ క్లబ్ అధ్యక్షుడు బలగ సీతారాం, ఒలింపిక్, పీఈటీ సంఘ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.



పతకాలు సాధించిన బాక్సింగ్ క్రీడాకారులతో లక్ష్మణ్‌దేవ్, కోచ్ ఉమా తదితరులు

సీఎంఆర్ఎఫ్ అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్ తదితరులు

జి.సిగడాం:

అనారోగ్యంతో బాధపడుతున్న కడగా న ప్రవళ్లికను ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకుంటుందని, అవసరమైన వైద్య సేవలను అందిస్తామని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మండలంలోని సంతవురిటి గ్రామానికి చెందిన ఆమెకు సీఎంఆర్ఎఫ్ కింద రూ.5 లక్షల చెక్కు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలబొమ్మ వెంకటేశ్వరావు, నాయకులు కుమరాపు రవికుమార్, వజ్జిపత్తి రఘురాం, బూరాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

- ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలు గాలికొదిలి, రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తోందని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మండిపడ్డారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తయినా ఇంతవరకు సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యలపై పోరాటాలు చేయడానికి సిద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గ్రామాల్లో సమస్యలపై ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అలాగే శనివారం రణస్థలంలో నిర్వహించనున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని పిలుపునిచ్చారు.

నియామకాలపై హర్షం



ధర్మాన కృష్ణదాస్‌ని సత్కరిస్తున్న డాక్టర్ చింతాడ వరుణ్

గార: వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా మార్పు దుర్గాపృథ్వీరాజ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ముంజేటి కృష్ణమూర్తిలను నియమించడంపై మండల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. మండల కన్వీనర్ పీస గోవిందరాజులు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, ఎంపీపీ గొండు రఘురామ్, జెడ్పీటీసీ మార్పు సుజాతమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావులకు ధన్యవాదములు తెలియజేశారు. శనివారం ఉదయం నియోజకవర్గ స్థాయిలో శ్రీకాకుళం నగరంలో నిర్వహించనున్న జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): తనను వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడిగా నియమించినందుకుగాను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్‌కి ప్రముఖ ఎముకలు, కీళ్ల వైద్యుడు డాక్టర్ చింతాడ వరుణ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు మబగాంలోని కృష్ణదాస్ నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనతో మాట్లాడుతూ.. పదవిని అప్పగించడం మరింత బాధ్యతను పెంచిందని, పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానని తెలియజేశారు. సహకరించిన పార్టీ పెద్దలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన ఎం.ఎ.బేగ్ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ముస్లిం సోదరులను ఏకం చేసి పార్టీ వెంటే నడిపించేందుకు కృషి చేస్తామన్నారు.

అధ్వానం



ఎచ్చెర్ల మండలంలోని ఎచ్చెర్ల జాతీయ రహదారి నుంచి ఆర్టీవో కార్యాలయం వైపు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రహదారికి గుంతలు ఏర్పడడంతో నిత్యం ఆర్టీవో కార్యాలయానికి వచ్చి పోయే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

– ఎచ్చెర్ల

వర్షపు నీరు తొలగింపు



గార మేజర్ పంచాయతీ శ్రీకూర్మంలోని సెగిడిపేట గ్రామంలో శుక్రవారం కురిసిన వర్షంతో నీరు నిలిచిపోయింది. దీంతో ఇళ్లలోకి వర్షపునీరు చేరి స్థానికులు అవస్థలు పడిపడ్డారు. విషయాన్ని ఎంపీటీసీ కైబాడి రాజుకి తెలియజేయడంతో జనరేటర్‌తో నీటిని తోడే ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అప్పన్న, సింహాచలం, నరసింగరావు, సురేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

– గార

స్థల పరిశీలన



ఎచ్చెర్లలోని శ్రీవేంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీలో డ్రోన్ టెక్నాలజీ ల్యాబ్ ఏర్పాటుకు న్యూఢిల్లీకి చెందిన ద్విసభ్య కమిటీ శుక్రవారం స్థల పరిశీలన చేసింది. కమిటీ సభ్యులు సాక్షి, సాగర్ చంద్ర కళాశాలలో పర్యటించి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌సీవీ రమణమూర్తి నాయుడు, మేనేజ్‌మెంట్ సభ్యులు డాక్టర్ బుడుమూరు శ్రీరాంమూర్తిలతో ల్యాబ్ ఏర్పాటుపై చర్చించారు. దేశంలో 47 డ్రోన్ ల్యాబ్‌లు ప్రారంభించనున్నట్లు వీరు తెలిపారు. ఈ ల్యాబ్‌ల ద్వారా సాంకేతికత విస్తరించనున్నట్లు వివరించారు. ల్యాబ్‌కు రెండు విడతల్లో రూ.50 లక్షలు అందజేస్తామని మొదటి విడత రూ.35 లక్షలు, రెండో విడతలో రూ.15 లక్షలు ఇస్తామని వెల్లడించారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

'బీజేపీ ఎంపీల తీరు సరికాదు'



నిరసన చేపడుతున్న కాంగ్రెస్ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: భారతీయ జనతా పార్టీ పార్లమెంట్ సభ్యులు గురువారం పార్లమెంట్ వద్ద ప్రవర్తించిన తీరు సరికాదని డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు అన్నారు. బీజేపీ నిరంకుశత్వ ధోరణి, పార్లమెంట్ వద్ద బీజేపీ నాయకులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ శుక్రవారం శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన భవన్ వద్ద కాంగ్రెస్ నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నేత పార్లమెంట్‌లోకి వెళ్తుంటే బీజేపీ నాయకులు అడ్డుకొని, తీవ్ర అసభ్యకర పదజాలంతో నినాదాలు చేస్తూ నెట్టివేసి, తిరిగి వారిపైనే కేసులు పెట్టాలని డిమాండ్ చేయడం దుర్మార్గపు చర్య అని మండిపడ్డారు. దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి డా.బీఆర్.అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రెల్ల సురేష్, కేవీఎల్ఎస్ ఈశ్వరి, అంబటి దాలినాయుడు, సైదుల్లా ఖాన్‌చాన్ బాషా, అంబటి లక్ష్మణరావు, సురియా బేగం, సోడవరపు లీలావతి, జరీనా, సోడవరపు చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

జి.సిగడాం: మండలంలోని వాండ్రంగి, పాలఖండ్యాం, జి.సిగడాం, పెంట గ్రామాల్లో ఉన్న ఎరువుల దుకాణాల్లో మండల వ్యవసాయశాఖ అధికారి యర్రా శారద శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. షాపులో ఎరువుల నిల్వ, రికార్డు నిర్వహణ, స్టాక్ వివరాలను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన ఎరువులను అందించడం జరుగుతుందన్నారు.